# Visit of the Prime Minister of the United Kingdom to India (April 21-22, 2022)

April 22, 2022

# యునైటెడ్ కింగ్‌డమ్ ప్రధాని భారత పర్యటన (ఏప్రిల్ 21-22, 2022)

ఏప్రిల్ 22, 2022

1. యునైటెడ్ కింగ్‌డమ్ ప్రధాన మంత్రి రైట్ హానరబుల్ బోరిస్ జాన్సన్, భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు 2022 ఏప్రిల్ 21-22 తేదీల్లో భారత్‌లో అధికారిక పర్యటనలో ఉన్నారు. యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) ప్రధాని హోదాలో ఆయన భారత్‌లో పర్యటించడం ఇదే ప్రథమం.

2. 2022 ఏప్రిల్ 22న రాష్ట్రపతి భవన్‌లో ప్రధాని జాన్సన్‌కు అధికారికంగా ఘన స్వాగతం లభించింది. ప్రధాని శ్రీ మోదీ ఆయనకు స్వాగతం పలికారు. ఆ తర్వాత యూకే ప్రధాని జాన్సన్ రాజ్ ఘాట్‌ను సందర్శించి, మహాత్మా గాంధీ సమాధి వద్ద పుష్ప గుచ్ఛం ఉంచి నివాళులు అర్పించారు.

3. భారత పర్యటనకు వచ్చిన యూకే ప్రధాని జాన్సన్‌తో హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. అలాగే ఆయన గౌరవార్థం విందు ఏర్పాటు చేశారు. అంతకు ముందు విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి డా. ఎస్. జైశంకర్, యూకే ప్రధాన మంత్రిని కలిశారు.

4. 2021 మే నెలలో వర్చువల్ సదస్సు సందర్భంగా ఆవిష్కరించిన రోడ్‌మ్యాప్ 2030కి సంబంధించి సాధించిన పురోగతిపై తాజా ద్వైపాక్షిక చర్చల్లో ఇరువురు ప్రధాన మంత్రులు సంతృప్తి వ్యక్తం చేశారు. ద్వైపాక్షిక సంబంధాలకు సంబంధించి అన్ని అంశాల్లో భారీ స్థాయిలో, కార్యాచరణ ఆధారిత సహకారం అందించుకునేందుకు కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ)పై కొనసాగుతున్న చర్చలు, మెరుగైన వాణిజ్య భాగస్వామ్యం అమలుకు సంబంధించి పురోగతిని సమీక్షించారు. సమగ్ర, సమతౌల్య వాణిజ్య ఒప్పందాన్ని 2022 అక్టోబర్ నాటికి కుదుర్చుకోవాలని నిర్ణయించారు. 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేసుకునేందుకు ఎఫ్‌టీఏతో మార్గం సుగమమవుతుంది.

5. రక్షణ, భద్రత సహకారాన్ని భారత్-యూకే సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంలో కీలక అంశంగా మార్చుకోవాలని ఇరువురు నేతలు నిర్ణయించారు. అలాగే రెండు దేశాల సాయుధ బలగాల అవసరాల కోసం అవసరమైన వాటిని సంయుక్తంగా అభివృద్ధి చేయడం, ఉత్పత్తి చేయడంతో సహా రక్షణ రంగంలో కలిసి పని చేసే అవకాశాలపై చర్చించారు. సైబర్ సెక్యూరిటీ ముఖ్యంగా సైబర్ గవర్నెన్స్, సైబర్ అవరోధాలు, కీలకమైన జాతీయ మౌలిక సదుపాయాల పరిరక్షణ వంటి అంశాల్లో పరస్పర సహకారాన్ని మరింతగా పెంపొందించుకోనున్నట్లు ఇరు పక్షాలు సంయుక్త ప్రకటన జారీ చేశాయి. అలాగే ఉగ్రవాదం, తీవ్రవాదం నుంచి నిరంతరం ఎదురయ్యే ముప్పులను ఎదుర్కోవడంలో మరింతగా సహకరించుకోవాలని వారు నిర్ణయించారు.

6. ఇండో-పసిఫిక్, ఆఫ్ఘనిస్థాన్, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి (యూఎన్ఎస్సీ), జీ20, కామన్వెల్త్‌కు సంబంధించి ఇరు పక్షాల ప్రయోజనాల విషయంలో పరస్పర సహకారం అందించుకోవడంతో సహా ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై ఇరువురు ప్రధానులు తమ తమ అభిప్రాయాలను ఇచ్చిపుచ్చుకున్నారు. సముద్ర భద్రత (మారిటైమ్ సెక్యూరిటీ) కీలక అంశంలో భాగంగా ఇండో-పసిఫిక్ ఓషన్స్ ఇనిషియేటివ్‌లో యూకే చేరడాన్ని అలాగే ఇండో-పసిఫిక్ ప్రాంతంలో మరింతగా కలిసి పనిచేయాలని నిర్ణయించడాన్ని భారత్ స్వాగతించింది.

7. ప్రస్తుతం కొనసాగుతున్న ఉక్రెయిన్-రష్యా వివాదంపై కూడా ఇరువురు నేతలు చర్చించారు. మానవీయ సంక్షోభం తీవ్రతరమవుతుండటంపై ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. వివాద పరిష్కారానికి తక్షణం హింసను విడనాడి, తిరిగి ప్రత్యక్ష చర్చలు, దౌత్య మార్గం బాట పట్టడమే ఏకైక మార్గమన్న తన అభిప్రాయాన్ని పునరుద్ఘాటించారు.

8. గతేడాది కాప్-26 సదస్సును విజయవంతంగా నిర్వహించడంపై ప్రధాన మంత్రి జాన్సన్‌ను ప్రధాని మోదీ అభినందించారు. ప్యారిస్ ఒప్పందంలో నిర్దేశించుకున్న లక్ష్యాల ప్రకారం వాతావరణ మార్పుల నియంత్రణకు సంబంధించిన భారీ కార్యాచరణకు, గ్లాస్గో క్లైమేట్ ఒప్పందం అమలుకు కట్టుబడి ఉన్నామని వారు పునరుద్ఘాటించారు. ఆఫ్-షోర్ పవన విద్యుత్, హరిత హైడ్రోజన్‌తో సహా పర్యావరణ అనుకూల విద్యుత్ విధానాలను వేగవంతంగా అమల్లోకి తేవడంలో సహకారాన్ని మరింతగా పెంపొందించుకోవాలని వారు నిర్ణయించుకున్నారు. అలాగే కాప్-26 సందర్భంగా భారత్, యూకే సంయుక్తంగా ఆవిష్కరించిన సీడీఆర్ఐలో భాగంగా అంతర్జాతీయ సౌర కూటమి (ఐఎస్ఏ) మరియు ఐఆర్ఐఎస్ ప్లాట్‌ఫామ్ కింద గ్లోబల్ గ్రీన్ గ్రిడ్స్-ఒకే సూర్యుడు ఒకే

ప్రపంచం గ్రిడ్ కార్యక్రమాన్ని (ఓఎస్ఓడబ్ల్యూఓజీ) త్వరగా అమల్లోకి తేవడంపై కలిసి పనిచేయాలని నిర్ణయించారు.

9. భారత్-యూకే గ్లోబల్ ఇన్నోవేషన్ పార్ట్నర్షిప్పై, అలాగే గ్లోబల్ సెంటర్ ఫర్ న్యూక్లియర్ ఎనర్జీ పార్ట్నర్షిప్ (జీసీఎన్ఈపీ) అమలుపై పర్యటన సందర్భంగా రెండు అవగాహన ఒప్పందాలు (ఎంవోయూ) కుదిరాయి. గ్లోబల్ ఇన్నోవేషన్ పార్ట్నర్షిప్ కింద మూడో ప్రపంచ దేశాల్లో వాతావరణ ప్రయోజనకరమైన నిలకడైన, స్మార్ట్ ఆవిష్కరణలను బదలాయించేందుకు, వాటిని మరింతగా అభివృద్ధి చేసేందుకు 75 మిలియన్ పౌండ్ల మేర భారత్, యూకే సంయుక్తంగా ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించాయి. ఈ భాగస్వామ్యం కింద రూపొందించిన వినూత్న జీఐపీ నిధి, భారతీయ ఆవిష్కరణలకు తోడ్పాటు అందించేందుకు మార్కెట్ నుండి మరో 100 మిలియన్ పౌండ్లను సమీకరించాలని కూడా నిర్దేశించుకుంది.

10. ఈ కింది ప్రకటనలు కూడా జారీ చేశారు – (I) వ్యూహాత్మక టెక్ చర్చలు – 5జీ, ఏఐ వంటి కొత్త మరియు వినూత్న కమ్యూనికేషన్ టెక్నాలజీలపై మంత్రుల స్థాయి చర్చలు జరపడం (II) సమీకృత ఎలక్ట్రిక్ ప్రొపల్షన్ – ఇరు దేశాల నావికా దళాల మధ్య టెక్నాలజీని సంయుక్తంగా అభివృద్ధి చేసుకోవడం.

11. ఏప్రిల్ 21న ప్రధాన మంత్రి జాన్సన్ గుజరాత్లోని అహ్మదాబాద్ను సందర్శించడం ద్వారా తన పర్యటన ప్రారంభించారు. అక్కడ ఆయన సబర్మతీ ఆశ్రమాన్ని సందర్శించారు. వడోదరలోని మాస్వాడ్ ఇండస్ట్రియల్ ఎస్టేట్లో జేసీబీ ప్లాంటును, గాంధీనగర్లోని గిఫ్ట్ సిటీలో ఉన్న గుజరాత్ బయో టెక్నాలజీ యూనివర్సిటీని కూడా ఆయన సందర్శించారు.

12. భారత్ అధ్యక్షతన 2023లో జరిగే జీ20 సదస్సులో పాల్గొనేందుకు భారత్ రావాలని యూకే ప్రధాన మంత్రి జాన్సన్ను ప్రధాని మోదీ ఆహ్వానించారు. యూకే పర్యటనకు రావాల్సిందిగా ప్రధాని మోదీని ప్రధాన మంత్రి జాన్సన్ మరోసారి ఆహ్వానించారు. ఆయన ఆహ్వానాన్ని ప్రధాని మోదీ స్వీకరించారు.

కుదుర్చుకున్న ఎంవోయూల జాబితా

**న్యూఢిల్లీ**
**ఏప్రిల్ 22, 2022**

DISCLAIMER: This is an approximate translation. The original is available in English on MEA's website and may be referred to as the official press release.